క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గాండ్లపెంట: మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది గురువారం ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్, ఈపీఎఫ్, ఉద్యోగ భద్రతపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, సీఆర్పీలు రమేష్, అంజినప్ప, ప్రహ్లాద, మస్తాన్, శకుంతల, ఐఈఆర్టీ భారతి, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్రం స్థలంపై విచారణ



విచారణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కదిరి అర్బన్: నున్నపుగుట్టతండాలో నరసింహస్వామి సత్రం స్థలంపై గురువారం వీఆర్ఓ ఇనయతుల్లా విచారణ చేపట్టారు. సత్రానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 458లోని 55సెంట్ల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి రోడ్డు పక్కనే ఉన్న 458–1లో సత్రానికి సంబంధించిన 3 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసి అమ్మేశాడని కొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కొన్ని దశాబ్దాల కిందట నరసింహస్వామి భక్తులు, బాటసారుల కోసం అక్కడ సత్రాన్ని నిర్మించారు. సత్రం కట్టించిన దాతల వారసులు తమకు చెందిన 55 సెంట్ల భూమిని విక్రయించారు. భూమి కొన్న వ్యక్తి అక్కడ సత్రాన్ని తొలగించి తన స్థలంతో పాటు సత్రం స్థలాన్ని కూడా అమ్మేశాడని ఫిర్యాదు అందడంతో విచారణ నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులు పంపనున్నట్లు వీఆర్ఓ తెలిపారు.


నిత్యావసరాలను సకాలంలో పంపిణీ చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి: నిత్యావసరాలను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ స్వర్ణలత డీలర్లకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డుదారులు ఎవరూ తమకు నిత్యావసరాలు అందలేదని ఫిర్యాదు చేయకూడదన్నారు. ఈ–కెవైసీని డీలర్లు అందరూ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలో ఎండియూ ఆపరేటర్ల ప్రమేయం లేకుండా తామే థంబ్ వేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లు కోరారు. బఫర్ స్టాక్‌తో రేషన్ కార్డుదారులకు అందించడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆ బఫర్ స్టాకును ఇప్పించాలని కోరారు.

రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగి పుల్లయ్య రెండేళ్లుగా ప్రతి మొదటి గురువారం ఉచిత అన్నదానానికి ఆర్థికంగా ఆదుకుంటున్నాడని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, పాస్ట్ ప్రెసిడెంట్ వైకే శ్రీనివాసులు, సభ్యులు సత్రసాల మల్లికార్జున, కౌన్సిలర్ కేతా లోకేష్ తెలిపారు.

మొక్కజొన్న పంట ధ్వంసం



అడవి పందులు ధ్వంసం చేసిన పంటను చూపుతున్న రైతు

తనకల్లు: కురుమాలపల్లిలో మొక్కజొన్న పంటను గురువారం అడవి పందులు ధ్వంసం చేశాయి. వివరాలు... గ్రామానికి సుధాకర్‌రెడ్డి తన బోరు కింద రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఇంకో పదిహేను రోజుల్లో పంట కోయాల్సి ఉంది. అడవి పందులు ఎకరా పొలంలోని పంటనంతా ధ్వంసం చేశాయి. ఘటనలో రూ. 2 లక్షలు వరకు నష్టం జరిగినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.



భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట



వట్టిపోయిన కనగానపల్లి చెరువు

మరమ్మతులకు మోక్షమెప్పుడో?

- గత ఏడాది భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- బీళ్లుగా మారుతున్న ఆయకట్టు భూములు
- బీసీ కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు

కనగానపల్లి: పంటల సాగుకు నీరందించే చెరువు కట్ట తెగిపోవడంతో అన్నదాతలకు ఆధారం లేకుండా పోయింది. గత అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రం కనగానపల్లిలోని సాగునీటి చెరువు కట్ట తెగిపోయింది. తిరిగి అధికారులు చెరువు కట్ట మరమ్మతులు చేపట్టకపోవడంతో స్థానిక రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024, అక్టోబర్ 21వ తేదీ రాత్రి మండలంలో ఎప్పుడు కురవని విధంగా 198 మి.మీ. వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరడంతో గ్రామ సమీపంలోని చెరువు కట్ట తెగిపోయింది. దీనివల్ల ఆయకట్టు కింద సాగు చేసిన వరిమళ్లు, ఇతర పంటలు కొట్టుకుని పోయాయి. ఈ సంఘటన జరిగిన రెండవ రోజు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌తో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఇరిగేషన్ అధికారులు వచ్చి దెబ్బతిన్న పంటలతో పాటు తెగిన చెరువు కట్టను పరిశీలించి వెళ్లారు. పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారాన్ని ఇప్పించటంతో పాటు చెరువుకట్ట మరమ్మత్తు పనులు కూడా వెంటనే చేపడతామని చెప్పి చేతులు దులుపుకున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

కనగానపల్లి సాగునీటి చెరువు కట్ట తెగిపోయి ఇప్పటికి సుమారు 5 నెలలు అవుతున్నా అధికారులు ఇంతవరకూ పట్టించుకోలేదని రైతులు మండిపడుతున్నారు. కట్ట మధ్య భాగంలో తెగిపోవటంతో చెరువులో చుక్కనీరు కూడా నిల్వ లేకుండా పోయింది. ప్రస్తుతం హంద్రీ–నీవా కాలువ నుంచి చెరువులోకి నీరు వస్తున్నా ఆ నీరంతా నేరుగా బయటకు వెళ్లిపోతోంది. దీంతో ఆయకట్టు కింద ఉన్న భూముల్లో రబీలో పంటలు కూడా సాగు చేయలేదని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు చెరువులో నిల్వ లేకపోవటంతో చుట్టు పక్క ప్రాంతాల్లోని బోరుబావుల్లో కూడా నీరు అడుగంటిపోయాయి. దీనివల్ల పంటల సాగుకు ఇబ్బందిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే 500 ఎకరాల సాగు భూములు బీళ్లుగా మారే అవకాశం ఉందని స్థానిక రైతులు పోతలయ్య, నారాయణ, రాముడు, ముత్యాలమ్మ చెబుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

కనగానపల్లి బీసీ కాలనీ–1 చెరువు కట్టకు ఎగువ భాగంలో ఉంది. స్థానిక కాలనీవాసులు చుట్టు పక్కల ఉన్న వారి పొలాల్లోకి వెళ్లాలన్నా, ధర్మవరం వెళ్లే ప్రధాన రహదారిలోకి వెళ్లాలన్నా ఈ కట్ట మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే చెరువు కట్ట తెగిపోవడంతో 50 కుటుంబాలు పైగా ఉన్న ఈ కాలనీవాసులంతా ప్రస్తుతం కి.మీ. పైగా అదనంగా నడిచి పొలాల దగ్గరకు వెళ్తున్నారు. దీంతో పాటు పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులు, వ్యాపారులు చెరువు కట్ట కింద ముళ్లకంపల్లో దూరి ప్రధాన రహదారిలోకి వెళ్తున్నారు.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది



మా కాలనీ నుంచి వ్యవసాయ పొలాల దగ్గరకు వెళ్లాలంటే చెరువు కట్ట మీదుగానే వెళ్లే వాళ్లం. ప్రస్తుతం చెరువు కట్ట తెగిపోవటంతో కి.మీ దూరం పాటు అదనంగా నడిచి ముళ్ల కంపల్లో దూరి పొలాల దగ్గరకు వెళ్తున్నాం. సమీపంలోని ప్రధాన రహదారిలోకి వాహనాల్లో వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది.

– పోతలయ్య, బీసీ కాలనీ–1, కనగానపల్లి

నీరు వృథాగా పోయింది



కనగానపల్లి చెరువు కట్ట తెగిపోయి చుక్కనీరు నిల్వ ఉండకుండా పోయింది. దీంతో ఆయకట్టు కింద ఉన్న వంద ఎకరాల భూములతో పాటు, చుట్టు పక్కల ఉన్న బోరుబావుల కింద ఉన్న 400 ఎకరాల భూములకు కూడా సాగునీరు అందడం లేదు. దీంతో ప్రస్తుతం ఈ భూములన్నీ బీళ్లుగా మారుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చెరువుకట్టకు మరమ్మతులు చేపట్టాలి

– అంకె పురుషోత్తం, బీసీ కాలనీ–1, కనగానపల్లి

రాకపోకలకు అవస్థలు



మా కాలనీ నుంచి బయట ప్రాంతాలకు వెళ్లాలంటే చెరువుకట్ట మీదుగా వెళ్లే వాళ్లం. ప్రస్తుతం చెరువు కట్ట తెగిపోవడంతో బడులకు వెళ్లే పిల్లలతో పాటు రోజు పట్టణాలకు వెళ్లే వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. చెరువుకట్ట ఉన్న ముళ్ల కంపల్లో దూరి ధర్మవరం రహదారిలోకి వెళ్తున్నాం. కట్ట పనులు త్వరగా పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

– రాయమ్మ, బీసీ కాలనీ–1, కనగానపల్లి

నివేదికలు పంపాం

భారీ వర్షానికి తెగిన కనగానపల్లి చెరువు కట్ట మరమ్మతు పనుల కోసం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కాని ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు విడుదల కాలేదు. నిధులు వచ్చిన వెంటనే చెరువు కట్ట మరమ్మతులు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, కనగానపల్లి మండలం

పోలీస్‌స్టేషన్‌లో 'టెన్త్' ప్రశ్నపత్రాలు

గాండ్లపెంట: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలను గురువారం పరీక్షల చీఫ్ శ్రీధర్‌రెడ్డి, డీఓ రామాంజులు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌ని లాకప్‌లో భద్రపరిచారు. కాగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు ఎన్‌పీకుంట గూటిబైలు పాఠశాల విద్యార్థులు సుమారు 390 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓ కృష్ణానాయక్ తెలిపారు. గాండ్లపెంట ఉన్నత పాఠశాలతో పాటు కస్తూర్బా పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాజారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాసులురెడ్డి

తలుపుల : మండల కేంద్రంలోని బురుజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సి.రాజారెడ్డి (58) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని రాజారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డి, ఉత్తారెడ్డి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జ్ డీకేబాబు, ఎంపీపీ రఫీనాయక్ తదితరులు రాజారెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పించారు.

మామిడి, నేరేడు చెట్ల దగ్ధం

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన మేకల చంద్రశేఖర్ అనే రైతు పొలంలో మామిడి, టెంకాయ, నేరేడు చెట్లు దగ్ధమయ్యాయి. రైతు వంకమద్ది పొలం సర్వే నెంబరు 182లోని తన పొలంలో 10 టెంకాయ చెట్లు, 12 మామిడి చెట్లు, 5 నేరేడు చెట్లు ఐదేళ్ల నుంచి సాగు చేస్తున్నాడు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో చెట్లు పూర్తిగా కాలిపోయాయి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అమడగూరు: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన స్టేషన్‌కు ఎదురుగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను తెలియజేశారు.

'ఫీజు పోరు'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

కదిరి టౌన్: ఈనెలలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయులకు తీవ్రగాయాలు



గాయపడిన ఉపాధ్యాయులు నరేష్, మహబూబ్

ముదిగుబ్బ: ఏబీపల్లి(అడవిబ్రాహ్మణపల్లి) తండా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పెద్దన్నగారిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నరేష్, మహబూబ్ పాఠశాల ముగిసిన అనంతరం బైక్‌పై మండల కేంద్రానికి బయలుదేరారు. ఏబీపల్లితండా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్: కాళసముద్రం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు... పట్టణానికి చెందిన నాగేంద్ర ఓ ప్రైవేటు డైరీలో సేల్స్‌మెన్‌గా పని చేసేవాడు. ఉదయం కదిరి నుంచి పాలవ్యాన్‌లో అనంతపురం వైపునకు బయలుదేరాడు. కాళసముద్రం గ్రామంలో రోడ్డు పక్కన వద్ద వ్యాన్ ఆపాడు. అనంతపురం నుంచి వస్తున్న మినీ వ్యాన్ పాలవ్యాన్‌ను ఢీ కొంది. దీంతో పాల వ్యాన్‌లో ఉన్న నాగేంద్రకు తలకుగాయమైంది. స్థానికులు వెంటనే అతడిని కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్ జ్యోతి స్వరూప అయ్యప్ప సేవా కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపారాయణం, యాగశాలార్చన, ప్రధాన దేవతా మూలమంత్ర హోమం, అయ్యప్పస్వామి మూల మంత్ర హోమం చేశారు. అనంతరం రోహిణి నక్షత్రంలో స్వామి విగ్రహ ప్రాణప్రతిష్టాపన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామికి మహాకుంభాభిషేకం, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రైతులందరికీ పంట నష్ట పరిహారం అందించాలి



దాడితోటలో చీనీ తోటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తాడిమర్రి: దాడితోట వద్ద కొండలపై అదాని సంస్థ చేపట్టిన పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు పనులతో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన దాడితోట గ్రామంలో పండ్లతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని సంస్థ కొండపై సుమారు ఒకటిన్నర కిలోమీటర్ పొడవు, 250 అడుగుల లోతుతో పెద్ద గుంతను తవ్విందన్నారు. గుంతను తవ్వి మట్టిని పెద్ద కొండగా పోయడంతో సమీపంలో ఉన్న పండ్లతోటలపై దుమ్ము పేరుకుపోయి అరటి, చీనీ, తదితర పంటలు దెబ్బతింటున్నాయన్నారు. పంట ఉత్పత్తులపై దుమ్ము పేరుకుపోవడంతో మార్కెట్‌లో సరైన ధర లభించడం లేదన్నారు. అధికారులు అదాని కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి పంటనష్ట పరిహారం అందించేలా కృషి చేయాలని ఆయన కోరారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, ఆదినారాయణ, కదిరప్ప, నాగార్జున, పోతలయ్య, నారాయణ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పనితీరుపై అవగాహన



ఉమెన్ హెల్ప్‌డెస్క్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్



ముదిగుబ్బలో విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న సీఐ శివరాముడు

ధర్మవరం అర్బన్: స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీస్‌స్టేషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, అక్కడున్న వసతులు, వైర్‌లెస్, హెల్ప్ డెస్క్ తదితర వాటిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని వన్ టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రధానంగా ఉమెన్ హెల్ప్ డెస్క్, వైర్‌లెస్ ద్వారా కమ్యూనికేషన్ ఎలా జరుగుతుందో సీఐ వివరించారు. ఎస్ఐ గోపికుమార్, ఏఎస్ఐ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కృష్ణవేణి గురువారం కస్తూర్బా విద్యార్థినులకు పోలీసుల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పేద, ధనికులు, కులమతాలకు అతీతంగా పౌరులందరికీ పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరుగుతుందన్నారు. ఎవరైనా తమకు అన్యాయం జరిగితే పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళల భద్రత కోసం మహిళా పోలీసులతో ప్రత్యేకంగా డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం నిడిగల్లు గ్రామంలో ఎస్ఐ మోటర్ వెహికల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ముదిగుబ్బ: పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యార్థినులకు పోలీసుల పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శివరాముడు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓడీచెరువు: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రెయిన్‌బో పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధులు, ఉమెన్ హెల్ప్ డెస్క్, రిసెప్షన్ సెంటర్, లాకప్, స్టేషన్ రికార్డులు, వీహెచ్ఎఫ్ సెట్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం

కదిరి: కదిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు వైఎస్సార్‌సీపీ నూతన మండల కన్వీనర్లను నియమించింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. కదిరి టౌన్ అధ్యక్షుడిగా షేక్ బాబ్జాన్, కదిరి రూరల్ కన్వీనర్‌గా మూడే మణికంఠ నాయక్, తలుపుల ఫయాజ్ అహ్మద్, గాండ్లపెంట గజ్జల రవీంద్రనాథ్‌రెడ్డి, ఎన్‌పీకుంట కొత్త రంగారెడ్డి, నల్లచెరువు ఎం.రవికుమార్ రెడ్డి, తనకల్లు మండల కన్వీనర్‌గా మబ్బు అశోక్‌వర్ధన్ రెడ్డిని నియమించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. గురువారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి కనంపల్లిలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు



మాట్లాడుతున్న హబీబుల్ రహమాన్

ధర్మవరం రూరల్: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టంలోని సెక్షన్ 44(3)చట్టాన్ని సవరించడం ద్వారా సమాచార హక్కు చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ఆర్‌టీఐ అవగాహన సంస్థ రాష్ట్ర కన్వీనర్ హబీబుల్ రహమాన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె)కి చేసిన సవరణ అన్ని రకాల వ్యక్తి గత సమాచారాన్ని సమాచార హక్కు పరిధి నుంచి తప్పించాలని చూస్తోందన్నారు. ప్రజల కోసం ఇచ్చిన నిధులను సైతం అడగకుండా ఉండేందుకు డీపీడీపీ చట్టాన్ని సవరించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ప్రెసిడెంట్ సునీల్, ఉపాధ్యక్షుడు ఏటూరి పోతులయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమయ్య, గౌరవాధ్యక్షుడు బాలకృష్ణ, అధ్యక్షుడు అయాజ్, సభ్యులు చింతా శ్రీనివాసులు, మహమ్మద్ సైఫ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

ముదిగుబ్బ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ సిబ్బందికి అధికారులు సహకరించాలని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సూచించారు. ఇంచార్జ్ ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ సెక్రటరీ మంజుల, ఏపీఓ రమణారెడ్డి, ఎస్ఆర్‌పీ మహేష్, ఇంజనీరింగ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినుల ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణను ప్రారంభించారు. మండల విద్యాధికారి చెన్నకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో విద్యార్థినులు తమకు తాము కాపాడుకునేందుకు ఈ కరాటే శిక్షణ ఎంతగానోతోడ్పతుందన్నారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కనగానపల్లి: సమాజంలో సముచిత స్థానం పొందాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఏటీఎల్ పద్మావతి తెలిపారు. మండలంలోని ముత్తవకుంట్ల గ్రామంలో గురువారం ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీటీ పాఠశాల వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఏటీఎల్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే అందరిలో సామాజిక చైతన్యం రావాలన్నారు. ముఖ్యంగా బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దడంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఇందుకోసం ఆర్డీటీ సంస్థ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. సీఓ రామకృష్ణ, మహిళా పోలీసు సుధారాణి, సీడీసీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.